నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
10 | నిజామాబాద్ శుక్రవారం 21 ఫిబ్రవరి 2025 | ADILABAD NIRMAL

కేసీఆర్‌ను కలిసిన నాయకులు

కేసీఆర్‌తో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, భూక్యా జాన్సన్ నాయక్

ఆదిలాబాద్(నమస్తే తెలంగాణ)/ఖానాపూర్, ఫిబ్రవరి 20 : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గురువారం హైదరాబాద్‌లోని నందినగర్‌లో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని కేసీఆర్ సూచించారని తెలిపారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని పార్టీ కోసం కష్టపడాలని సూచించారని పేర్కొన్నారు.

కేటీఆర్ సమక్షంలో రమేశ్ చేరిక

రమేశ్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బైంసా, ఫిబ్రవరి 20 : కుభీర్ మండలంలోని కుప్టి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గంగుబాయి కుమారుడు రమేశ్ హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ ఆయనకు బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం రమేశ్ మాట్లాడు తూ.. కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక బీఆర్ఎస్‌లో చేరినట్లు చెప్పారు. బీఆర్ఎస్ హయాంలోనే సకల జనులు అభివృద్ధి చెందినట్లు పేర్కొన్నారు. ఇందులో ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకురాలు పడకంటి రమాదేవి పాల్గొన్నారు.

గూగుల్ మీట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

పథకాలపై కలెక్టర్ సమీక్ష

ఎదులాపురం, ఫిబ్రవరి 20 : గూగుల్ మీట్ ద్వారా గురువారం సంబంధిత అధికారులతో కలెక్టర్ రాజర్షి షా తాగునీరు, రైతు భరోసా, రేషన్ కార్డులు, పైలెట్ ప్రజావాణి, ఎల్ఆర్ఎస్, పవర్ స్విచ్ వేషన్, ఇందిరమ్మ ఇండ్లు, ఈఈపీసీ సర్వే ఆఫ్ లెఫ్ట్ ఓవర్ హౌస్ హోల్డర్ వంటి ఎనిమిది అంశాలపై సమీక్షించారు. ప్రజాపాలన, గ్రామ సభల్లో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ మీ సేవలో దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఒకవేళ ప్రజాపాలన, గ్రామసభల్లో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేయని వారు కొత్త రేషన్ కార్డు, కుటుంబ సభ్యుల పేర్లు చేర్చుట కొరకు మీసేవలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు సమ్మర్ యాక్షన్ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ప్రతినెల ఒకటో తేదీ నుంచి 21వ తేదీ వరకు మున్సిపల్, పంచాయతీల్లో ట్యాంకర్లలో క్లీనింగ్, ఫ్లషింగ్, బ్లీచింగ్ పౌడర్ క్లోరినేషన్ వేయాలని సూచించారు. యూరియా సమస్య ఎక్కడైనా ఉందా? అని అడిగి తెలుసుకుని, యూరియా సమస్య తలెత్తితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గూగుల్ మీట్‌లో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ట్రెయినీ కలెక్టర్ అభిగ్యాన్, ఆర్డీవో వినోద్ కుమార్, జడ్పీ సీఈవో జితేందర్, 2 బీహెచ్‌కే భశవేశ్వర్ రావ్ పాల్గొన్నారు.

ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

ప్రతి పాఠశాలలో యూనిఫాం అందించడానికి ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని యూనిఫాం స్టిచింగ్ కోసం డిజైన్ చేసి ఇస్తామని తెలిపారు. మ్యాచింగ్ గ్రూప్ చేసి ప్రతి స్కూల్‌కి వెళ్లి విద్యార్థుల మేజర్‌మెంట్ వారంలోగా తీసుకోవాలని, మార్చి మొదటి వారంలో క్లాత్ వస్తుందని పేర్కొన్నారు.

ఎల్‌పీజీ గ్యాస్ ఏజెన్సీ డీలర్లతో సమావేశం

ఎల్‌పీజీ గ్యాస్ ఏజెన్సీ డీలర్లతో కలెక్టర్ రాజర్షి షా తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్యాస్ లబ్ధిదారుని ఈకేవైసీ, నెట్‌వర్క్ లేని గ్రామాల్లో క్యాంపు పెట్టి ఈకేవైసీ చేయాలన్నారు. గ్యాస్ రాయితీ రాని వారు సంబంధిత గ్యాస్ ఏజెన్సీలో దరఖాస్తు చేసుకొమ్మని లబ్ధిదారుడికి తెలియచేయాలని కోరారు. నెట్‌వర్క్ రాని గ్రామాల్లో లబ్ధిదారుల కోసం నెట్‌వర్క్ వచ్చే పక్క గ్రామంలో క్యాంప్ పెట్టాలన్నారు. సంబంధిత గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు తప్పకుండా నియమాలు, సూచనలు పాటించాలని ఆదేశించారు.

బాలశక్తి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి

కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్(లక్ష్మణచాంద), ఫిబ్రవరి 20 : బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీలో జిల్లా విద్యాశాఖ సహకారంతో ధర్మసేవా చారిటబుల్ ట్రస్ట్ ధీర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి రాణించాలని సూచించారు. విద్యార్థులను అభివృద్ధి చేయడానికి బాలశక్తి నూతన కార్యక్రమాన్ని రూపొందించి, జిల్లాలోని 57 ప్రభుత్వ సంక్షేమ వసతి గృహ పాఠశాలల్లో నిర్వహిస్తున్నామన్నారు. బాలశక్తి కార్యక్రమం ద్వారా ఆర్థిక అక్షరాస్యత, ఆరోగ్యం, నైపుణ్యాల పెంపు, క్షేత్ర పర్యటనల వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. బాలశక్తి కార్యక్రమాన్ని పటిష్టం చేయడానికి ధర్మసేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధ్యానం, యోగ, నైతిక విలువలతోపాటు విద్య, మార్షల్ ఆర్ట్స్ వంటి వాటిని నేర్పిస్తున్నామన్నారు. ఆడపిల్లలు అన్ని రంగాల్లో ముందుండాలని, ప్రతి విద్యార్థి ఉద్యోగం సాధించాకే పెండ్లి గురించి ఆలోచించాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, ధర్మసేవ చారిటబుల్ ట్రస్ట్ ధీర ఫౌండేషన్ ప్రతినిధి నిశాంత్‌రెడ్డి, తహసీల్దార్ జానకి, ఎంపీడీవో రాధ, విద్యాశాఖ అధికారులు పద్మ, ప్రవీణ్‌కుమార్, వినోద్ కుమార్, కేజీబీవీ ప్రత్యేకాధికారి నవిత పాల్గొన్నారు.

ఎన్నికలకు పటిష్ట చర్యలు తీసుకోండి..

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 20 : ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ కార్యాలయం, ఎన్టీఆర్ స్టేడియం పక్కన ప్రభుత్వ పాఠశాలల్లోని టీచర్స్, గ్రాడ్యుయేట్స్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మెటీరియల్, బ్యాలెట్ బాక్సులు, ఓటింగ్ మిషన్స్ ఇతర అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, జడ్పీ సీఈవో గోవింద్, తహసీల్దార్లు సంతోష్, రాజు పాల్గొన్నారు.

మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం కత్తెరశాలలో పల్లెప్రకృతి వనం బోర్డు తప్ప మొక్కలు కనిపించని దుస్థితి

ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం బాలాపూర్‌లో నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్డు

ఆసిఫాబాద్ జిల్లా దాబా గ్రామంలో విరిగిన పార్ట్‌లతో కనిపిస్తున్న ట్రాక్టర్

మంచిర్యాల జిల్లా కొమ్మెర గ్రామంలో బురదమయంగా కనిపిస్తున్న రోడ్డు

నాడు అద్భుతం.. నేడు అస్తవ్యస్తం..

పంచాయతీలపై ప్రత్యేక దృష్టి సారించని కాంగ్రెస్ సర్కారు

- ప్రత్యేక అధికారుల పాలనకు ఏడాది పూర్తి
- పడకేసిన పారిశుధ్యం.. ఎండిపోతున్న పల్లె ప్రకృతి వనాలు..
- నిర్వహణ లేని సెగ్రిగేషన్ షెడ్లు, ట్రాక్టర్లు
- ఒక్కో అధికారికి రెండు, మూడు గ్రామాల బాధ్యతలు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏ గ్రామంలో చూసినా ఇదే దుస్థితి

మంచిర్యాల, ఫిబ్రవరి 20(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : యేడాది క్రితం వరకు పచ్చని పల్లె ప్రకృతి వనాలు, ఊరికో ట్రాక్టర్, చెత్త సెగ్రిగేషన్ షెడ్లు, ఎక్కడికి వెళ్లినా అద్దంలా మెరిసే రహదారులు.. ఇదీ కేసీఆర్ పాలనలో గ్రామాల పరిస్థితి. ప్రతినెలా పంచాయతీల నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయించారు. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లోని గ్రామ పంచాయతీలను పరిశీలించి అవార్డులు ప్రకటిస్తే.. అందులో పన్నెండు అవార్డులు మన పల్లెలకే వచ్చాయి. గ్రామాలంటే తెలంగాణలో ఉన్నట్లు ఉండాలంటూ.. అద్భుతమైన పల్లె పాలనకు కేసీఆర్ సర్కారు నిదర్శనం అంటూ యావత్ దేశం కీర్తించింది. ఇవన్నీ చేస్తూనే ఏడాదికోసారి పల్లె ప్రగతి కార్యక్రమంతో ప్రాణమంతా పల్లెలపైనే పెట్టి కేసీఆర్ సర్కారు పని చేసింది. కానీ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే పరిస్థితి తారుమారైంది. గ్రామ పంచాయతీలకు వచ్చే నెల వారి నిధులు ఆగిపోయాయి. 15వ ఆర్థిక సంఘం నిధుల మంజూరు నిలిచింది. దీంతో పాలన కూనారిల్లింది. నిధులు లేక, నిర్వహణ పట్టించుకునే నాథుడు లేక పల్లె ప్రకృతి వనాలన్నీ ఎండిపోయాయి. పచ్చదనంతో కళకళలాడిన ప్రకృతి వనాల్లో ఇప్పుడు మొండి మొక్కలు కనిపిస్తున్నాయి. నిర్వహణ లేక సెగ్రిగేషన్ షెడ్లు పాడైపోతున్నాయి. కిస్తీలు కట్టలేక గ్రామ పంచాయతీల్లోని ట్రాక్టర్లు మూలకు పడుతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏ పల్లె చూసినా దాదాపు ఇదే దుస్థితి కనిపిస్తున్నది.

పర్యవేక్షణ లోపం.. కార్యదర్శిపైనే భారం..

పంచాయతీ పాలక వర్గాల గడువు ముగిసి ఏడాది దాటింది. కులగణన మరోసారి చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఎన్నికలు వాయిదా పడనున్నాయి. ఇప్పటికే ఏడాది కాలంలో పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన నడుస్తున్నది. కాకపోతే ఒక్కో అధికారికి మూడు, నాలుగు గ్రామాలు అప్పగించడంతో పనిభారం ఎక్కువైంది. మండలాధికారులకు బాధ్యతలు ఇవ్వడంతో పర్యవేక్షణ లోపించింది. మరోవైపు మండల పరిషత్‌లకు జిల్లా అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించారు. దీంతో గ్రామ, మండల స్థాయిలో ఇబ్బందులు తప్పడం లేదు. సమావేశాలు, సంతకాలకే పరిమితమవ్వాల్సిన దుస్థితి నెలకున్నది. దీనికి తోడు నిధుల లేమి, పర్యవేక్షణలోపం, పాలన వ్యవహారాలు చూసేవారు కరవై జనాలు అవస్థలు పడుతున్నారు. నిధులు రాకపోవడం, ప్రత్యేక అధికారులు పట్టించుకోకపోవడంతో పంచాయతీల నిర్వహణ భారం కార్యదర్శులపైనే పడుతున్నది. పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, ట్రాక్టర్లు, ట్యాంకర్ల మెయింటెనెన్స్, తాగునీటి పథకాలకు మరమ్మతు, పైపులైన్ లీకేజీలు, వీధి దీపాలకు మరమ్మతులు అన్ని పనులకు కార్యదర్శి బేజుల్లో నుంచి సొంత డబ్బులు వెచ్చించాల్సి వస్తున్నది. నిధుల కొరతతో పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వడం కష్టంగా మారింది. ట్రాక్టర్, ట్యాంకర్, పల్లె ప్రకృతి వనాలు వీటన్నింటని సొంత డబ్బులతో చూసుకోలేకపోతున్నామని పంచాయతీ కార్యదర్శులే వాపోతున్నారు. ఎన్నికల విషయం దేవుడెరుగు ముందు పంచాయతీలకు నిధులు ఇవ్వాలంటూ వేడుకుంటున్నారు.

గ్రామాలను వేధిస్తున్న సమస్యలు..

- నిధులు లేక పల్లె ప్రకృతి వనాలు, బృహత్ ప్రకృతి వనాల నిర్వహణ కుంటుపడింది. పల్లె ప్రకృతి వనాల్లో ఏర్పాటు చేసిన బోర్డులు తప్ప మొక్కలు కనిపించడం లేదు.
- క్రీడా ప్రాంగణాల నిర్వహణ సరిగా లేదు. పలుచోట్ల క్రీడాప్రాంగాణాలను దున్ని సాగు చేస్తున్నారు. క్రీడా ప్రాంగణాల్లో అమర్చిన పరికరాలు తుప్పుపట్టి పాడైపోతున్నా పట్టించుకునే నాథుడు లేడు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాకపోవడంతో గత ప్రభుత్వం ఇచ్చిన ట్రాక్టర్లు, ట్యాంకర్లకు కిస్తీలు కట్టలేకపోతున్నారు.
- పారిశుధ్య నిర్వహణ గగనంగా మారింది. గతంలో పల్లెలకు పంపిణీ చేసిన చెత్త డబ్బాలు పాడైపోగా కొత్తవి కొనలేని దుస్థితి. చెత్త సేకరించేందుకు ట్రాక్టర్లకు డీజిల్ పోయించే పరిస్థితి లేదు. దీంతో రోడ్లపై ఎక్కడిచెత్త అక్కడే కనిపిస్తున్నది.
- తడిచెత్త, పొడిచెత్తను వేరుచేసే సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ లేదు. దీంతో అవి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా మారుతున్నాయి.
- పాడైపోయిన వీధి దీపాల స్థానంలో కొత్తవి బిగించలేని పరిస్థితి.

దీక్ష చేస్తున్న ఆల్ ఇండియా రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ సభ్యులు

నిరాహార దీక్ష చేపట్టిన రైల్వే ఉద్యోగులు

ఎదులాపురం, ఫిబ్రవరి 20 : రైల్వేశాఖ పెంచిన డీఏకు అనుగుణంగా రన్నింగ్ కిలోమీటర్ల అలవెన్స్‌ను పెంచాలని ఆల్ ఇండియా రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ ఆదిలాబాద్ బ్రాంచ్ కార్యదర్శి సంతోష్‌కుమార్ కోరారు. గురువారం రైల్వే స్టేషన్‌లో ఆల్ ఇండియా రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్, ఆల్ ఇండియా గార్డ్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో లోకో పైలేట్లు 36 గంటల నిరాహార దీక్ష చేపట్టారు. సంతోష్ కుమార్ మాట్లాడు తూ.. అలవెన్స్‌లు 70 శాతం ఇన్‌కం ట్యాక్స్ మినహాయింపు ఇవ్వాలని కోరా రు. తమ సమస్యల సాధన కోసం 36 గంటల నిరాహార దీక్ష చేస్తున్నామన్నారు. అధ్యక్షుడు సిరాజ్ అలం, కోశాధికారి అశిష్ రంజన్, ప్రేమశంకర్, నవీన్, నస్రత్ అలీ, సునీల్ కుమార్, హేమంత్ కుమార్, జితేందర్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతం

- భారీగా ఆస్తినష్టం.. ఏడిండ్లు దగ్ధం
- వెండి, బంగారం, నగదు, పంట ఉత్పత్తులు ఆహుతి
- మంటలను ఆర్పిన ఫైరింజన్ సిబ్బంది
- ఘటన స్థలాన్ని పరిశీలించిన ఆర్డీవో
- బాధితులకు వసతి కల్పించిన అధికారులు

మంటలను ఆర్పుతున్న ఫైరింజన్ సిబ్బంది

పెంబి, ఫిబ్రవరి 20 : రాయదారి గ్రామంలో గురువారం విద్యుదాఘాతంలో ఏడు ఇండ్లు దగ్ధమయ్యాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో మంటలను అదుపు చేశాయి. ఘటన స్థలాన్ని ఆర్డీవో రత్నకల్యాణి, సీఐ సైదరావ్, తహసీల్దార్ లక్ష్మణ్‌లు పరిశీలించారు. రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రాథోడ్ బిక్కుకు చెందిన ఇల్లు కాలిపోవడంతోపాటు 2 కిలోల వెండి, 2 తులాల బంగారం, రూ.3 లక్షల నగదు, 3 క్వింటాళ్ల జొన్నలు.. జాదవ్ భిమ్మకు చెందిన ఇల్లు, 2 తులాల బంగారం, అర కిలో వెండి, రూ.10 లక్షల నగదు, ఆరు క్వింటాళ్ల కందులు.. రాథోడ్ నరేశ్‌కు చెందిన ఇల్లు, 3 తులాల బంగారం, 40 తులాల వెండి, రూ.8 లక్షల నగదు, నిత్యావసర సరకులు.. జాదవ్ దినేశ్‌కు చెందిన ఇల్లు, ఐదు క్వింటాళ్ల పత్తి, ఐదు క్వింటాళ్ల జొన్నలు, ఎనిమిది క్వింటాళ్ల కందులు, ఐదు హెచ్‌పీ ఆయిల్ ఇంజన్.. దావత్ దేశాయ్‌కి చెందిన ఇల్లు, రూ.ఒక లక్ష నగదు, ఆరు క్వింటాళ్ల కందులు.. రాథోడ్ మహేందర్‌కు చెందిన ఇల్లు, రూ.11 లక్షల నగదు, ఐదు తులాల బంగారం, 50 తులాల వెండి, 10 క్వింటాళ్ల కందులు.. జాదవ్ రవీందర్‌కు చెందిన ఇల్లు, నిత్యావసర సరుకులు పూర్తిగా బూడిదయ్యాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో ఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ పాఠశాలలో వసతి ఏర్పాటు చేసి భోజన సౌకర్యాలు కల్పించారు. ఎంపీడీవో రమాకాంత్, ఎస్ఐ హన్మండ్లు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి..

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా

ఎదులాపురం, ఫిబ్రవరి 20 : మున్సిపల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, పీఆర్సీ, పెండింగ్ వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ అనుబంధ సంఘం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు దర్శనాల నగేశ్ డిమాండ్ చేశారు. గురువారం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని నినాదాలు చేశారు. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న పది గ్రూపుల ఏరియర్స్‌తోపాటు పీఎఫ్ చెల్లించాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, మున్సిపల్ యూనియన్ నాయకులు ఆత్మరాం, అజీం, భాస్కర్, జనార్దన్, రాకేశ్‌రెడ్డి, స్వామి, గగన్, వెంకటి, సాయికృష్ణ పాల్గొన్నారు.

కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఐసీఈయూ సభ్యులు

కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమ్మె

ఎదులాపురం, ఫిబ్రవరి 20 : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలు సక్రమంగా లేవని, ఇన్సూరెన్స్ రంగంలో ఎఫ్‌డీఐలను వ్యతిరేకిస్తున్నామని ఐసీఈయూ కార్యదర్శి చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. అఖిల భారత జీవిత బీమా ఉద్యోగుల సమాఖ్య(ఏఐఐఈఏ) ఆధ్వర్యంలో గురువారం ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ జీవిత బీమా సంస్థలో మూడు, నాలుగు తరగతుల ఉద్యోగుల నియామకాలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ నసీరుద్దీన్, సభ్యులు ఫహీం సిద్దికి, రాజేంద్రప్రసాద్, గుండా శ్రీరామ్, సాయి కృష్ణ, సుమంత్‌రెడ్డి, నీలానంద రెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.